[గోండుల పల్లె కథ]

# కొయ్యగుర్రం



అనగా అనగా ఒక వూరు. ఆ వూరికి ఒకరాజు. ఆ రాజుకి ఆరుగురు రాణులు. ఆరుగురిలో ఒక్కర్తెకీ సంతానంలేదు. వేట అంటే వెర్రిసరదా రాజుకి. అందుకని రోజూ అడివికి వెళ్ళేవాడు. ఓనాడు అడివిలో ఓ చెరువుదగ్గర చెట్టుకింద మాటు వేసుంచి. నీళ్ళకివచ్చే జంతువుల్ని వేటాడాలని కాసుక్కూచున్నాడతడు. ఆ చెట్టు మీద అడివిరాణి ఏడుస్తూ కూచుంది. ఆమె కన్నీళ్ళు రాజు గుండెలమీద పడ్డాయి. "ఏవో నీళ్ళు పడుతున్నాయి చూడండి" అంటూ తన నౌకర్లని పిలిచాడు రాజు. అందరూ చెట్టుని ఎగాదిగా చూశారు నౌకర్లు. ఎవరికీ ఏమీ కనపళ్ళేదు. కాని ఒంటికన్ను సిపాయికి మాత్రం కనపడింది "అదిగో, ఆ చివార యెవరో వున్నారు" అని అరిచాడు

"ఎవరు నువ్వు?" అడిగారు నౌకర్లు. "దేవతవా? దెయ్యానివా? రాకాసివా? చెప్పు, కిందికి దిగిరా" అన్నారు.

"ఊఁహూఁ రాను" అంది అడివిరాణి. "మీరు కొడతారని భయం" అంది. కాని చివరికి దిగి వచ్చింది. మంచి భోజనం పెట్టించాడు రాజు పెట్టిందంతా తినేసిందామె. "ఎన్నాళ్ళయి తిండి లేదో పాపం!" అనుకున్నారు నౌకర్లు ఆ రాత్రి రాజుతో వుందామె మర్నాడు ఆమెని తన కోటలోకి తీసుకువచ్చేశాడు రాజు.

ఆరుగురు రాణులూ చూశారు. "ఇదీ అసలు సంగతి, వేటకి అంటే నిజమే అనుకున్నాం మనం!" అంటూ గుసగుసలాడారు, మూతులు బుంగల్లా పెట్టుకుని. ఊరంతా గుప్పుమంది వార్త! అడివి రాణిని చూడాలని విరగబడ్డారు జనం. మూడు రోజులు గడిచాక ఆమెని పెళ్ళి చేసుకున్నాడు రాజు. గొప్పగా జరిగింది పెళ్ళి. పాత రాణులకి మచ్చరం పట్టుకుంది. కొత్తామె పొడంటేకిట్టేదికాదు వాళ్ళకి పాపం. ఒంటరిగా వుంటూ వచ్చేదామె. ముఖ్యంగా రాజు వేటకి వెళ్ళేటప్పుడు ఏమీ తోచేదికాదామెకి. అలా రెండు మూడేళ్ళు గడిచాక ఆమె చూలాలయింది. "చూడూ. రాజా!" ఓ నాడు మగడితో అందామె "నన్ను ఒంటరిగా వొదిలేసి నువ్వు రోజు రోజూ వేటకివెళ్ళిపోతున్నావు. కానుపు వచ్చినప్పుడు ఎలా? ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు?"

"భయపడకు" అన్నాడు రాజు! "మన కోట మీద పెద్ద గంట పెట్టిస్తాను. కానుపు కలిగే ముందు ఆ గంట మోగించు వున్నపళాన వచ్చి వాల్తాను" అంటూ ధైర్యం చెప్పాడు

చివరికి పురిటిక్షణాలు రానే వచ్చాయి. సమయానికి రాజు వేటలో వున్నాడు. నొప్పుల్లో తెలివితప్పి గంటమాటే తలపు లేదు అడివిరాణికి. ఆమె ఆరుగురు సవతులకీ అదును చిక్కింది. అడివిరాణిని ఓ ధాన్యంకొట్టులో పడేశారు. రతనాలమూటలాటి కొడుకుని కందామె. చప్పున బిడ్డని తీసేసి, అక్కడ ఒక రాతిగొడ్డ పెట్టేశారు సవతులు. పాపం. తెలివి వచ్చాక చీకట్లో ఏమీ కానలేకపోయింది అడివిరాణి. పిల్లణ్ణి తీసికెళ్ళి గేదెలపాకలో పడేశారు సవతులు. మచ్చుకి లేకండా అవి తొక్కేస్తాయి అనుకున్నారు వాళ్ళు

రాజు వేటనించి వచ్చాడు. ఆరుగురు రాణులూ రాతిగొడ్డతెచ్చి అతడిముందు పెట్టారు. "ఇదిగో, మీ అడివిరాణీ కన్న ముద్దుబిడ్డ రాతిగొడ్డ—చిత్తగించండి" అన్నారు. చేతుల్లో తలపెట్టుకుని చదికిలబడ్డాడు రాజు

అడివిరాణిని నాలుగుచోట్ల తల గొరిగించి పొలాల్లోకి పంపేశారు. చేలల్లో కాకులు రొప్పుతూ వుండమన్నారు.

అదంతా అయాక ఆరుగురిలో ఇద్దరు రాణులు గేదెల పాకకి వెళ్ళి చూశారు. గేదెలు తొక్కేయలేదు సరికదా పిల్లణ్ణి పాలు కుడిపి పెంచుకున్నాయి. అక్కణ్ణుంచి తీసి మేకల దొడ్డిలో పిల్లాణ్ణి పడేసిపోయారు వాళ్ళు. ఆ మర్నాడు మేకల దొడ్డి బాగుచేయడంకోసం ముసిలి కోనారి దంపతులు అక్కడికి వచ్చారు. కోనారి ముసిల్ది చూసింది. మేకలు పిల్లడికి పాలు కుడుపుతున్నాయి. తీసి కోక చెంగులో చుట్టి పట్టుకుంది. ముసిలాణ్ణి పిలిచి చెవిలో చెప్పింది. "అడివిరాణి కన్నబిడ్డ దొరికింది"


అప్పటింకా పొద్దు దూరలేదు. ఎవరి కంటా పడకుండా పిల్లణ్ణి ఇంటికి పట్టుకు వచ్చేశారు కోనారి దంపతులు. ఓ మేకని కోసేసి "మా ఇంటిది కొడుకును కన్నాది" అంటూ నలుగురితో చెప్పాడు ముసిలి కోనారి. భగమంతుడి దయ. ముసలి కాలానికి ముచ్చట తీర్చాడు అన్నారు. ముసిల్దానికి పాలమందు తినిపించాడు. ఆ మేకపాలు చేపాయి. దుబ్బులాగ పెరిగాడు బిడ్డడు, ఎనిమిదోనెలకే నిటారుగా నిలబడ్డాడు. సాయంలేకండానే కూచున్నాడు. ఏడాది నిండీ నిండగానే నడవడం పరిగెత్తడం మొదలెట్టాడు. ఊరి పిల్లల్ని చూసి తనకీ విల్లూ, బాణాలూ కావాలని

డాక్టర్ పురిపండా అప్పలస్వామి

మారాం చేశాడు. విల్లూ, బాణం తెచ్చి ఇచ్చాడు తండ్రి. పెద్ద పెద్ద చెట్లమీది పచ్చ పోకగులు కొట్టి తండ్రికి తెచ్చిచ్చేవాడు కుర్రాడు. తన వాడిపేలో ఏడు రాళ్ళుండేవి. సాటిపిల్లలు గురితప్పేవారు తరుచు. కోనారి కొడుకుమాత్రం యెన్నడూ తప్పేవాడు కాదు

ఊరి పిల్లలు గుర్రాలమీద ఏటికి వెళ్ళి స్నానాలుచేసి వచ్చేవారు. తనకీ ఒక గుర్రం కావాలని తండ్రితో మారాం చేశాడు కోనారి కొడుకు. ముసిలి కోనారి యిరవై రూపాయలు మొలలో దోపుకుని వూరి వడ్రంగి దగ్గరికి వెళ్ళాడు. తన కొడుకు కోసం కొయ్యగుర్రం చేసి ఇమ్మన్నాడు. పది రూపాయలు బయానా ఇచ్చాడు మిగిలిన పదీ గుర్రం పుచ్చుకుని ఇస్తానని ఖరారుచేశాడు. అయిదు రోజుల్లో గుర్రం కావాలన్నాడు. అన్నట్టే అయిదు రోజుల్లో వచ్చేసింది గుర్రం

"కొయ్య గుర్రమా! నువ్వే మా అమ్మనీ నన్నూ కలుపుతావు" అంటూ




దాన్ని ముద్దెట్టుకున్నాడు కోనారి కొడుకు. తక్కిన పిల్లల గుర్రాలతో తన కొయ్య గుర్రమెక్కి బయల్దేరాడు. పందెం వేశారు పిల్లలు వాళ్ళ గుర్రాలన్నిటనీ మించి గాలాప్పరుగు తీసింది కొయ్య గుర్రం

కోనారి కొడుకు సరదాగా ఇంటికి వచ్చాడు. కడుపునిండా తిండి తిన్నాడు. గుర్రం తీసుకుని ఏటికి బయల్దేరాడు ఆరుగురు రాణులూ స్నానాలు చేస్తున్న రేవుకి వెళ్ళాడు. గుర్రం నీటిలో పెట్టి "కొయ్య గుర్రమా నీళ్ళు తాగు" అంటూ దాని మొహం మాటిమాటికీ నీళ్ళలో ముంచాడు.

ఆరుగురు రాణులూ ఆలకించారు. "కొయ్యగుర్రాన్ని నీళ్ళు తాగమంటావేమిట్రా మూర్ఖుడా! కొయ్యగుర్రం నీళ్ళు తాగడం ఎప్పుడైనా చూశావురా? నువ్వుకాదు నీ బాబైనా చూశాడ్రా?" అన్నారు.

"అవును నిజమే" అంటూ అందుకున్నాడు కోనారికొడుకు "కాని ఆడమనిషికి రాతిగొడ్డు పుట్టడం ఎక్కడైనా చూశారా మీరు? మీరు కాదు మీ బాబులైనా చూశారా?" అని అడిగాడు.

ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకున్నారు రాణులు. వాళ్ళ గుండెలు కొట్టుకున్నాయి స్నానాలు చేసీ చెయ్యకండానే వెళ్ళిపోయారు వాళ్ళు. తిండీ తిప్పలూ మానేశారు. ముసుగులు తన్ని పక్కల మీద పడుకున్నారు.

"ఏమయిందట?" వేటనించివచ్చి అడిగాడు రాజు "అందరికీ జ్వరంవచ్చిందా?" అన్నాడు.

కొయ్య గుర్రం కుర్రాడు అన్న మాటలు రాజుతో చెప్పారు రాణులు. "బహుశా వీడే నా నిజమైన కొడుకేమో!" అంటూ రాజు బుర్రలో మెరుపులా మెరిసింది "సరే, కొయ్యగుర్రం కుర్రాణ్ణి పట్టుకురండి" అని సిపాయిలని పంపాడు.

రాజుగారి సిపాయిలని చూసి, గజగజ వణికిపోయాడు ముసిలి కోనారి. "నా బాబుని ఏం చేస్తారు నాయనా!" అంటూ రాగాలు తీసింది ముసిల్ది. "భయంలేదు" అంటూ రాజుగారి కచేరీకి వెళ్ళాడు కోనారి కొడుకు. జంకూ గొంకూ లేకుండా జరిగిందంతా రాజుముందు వినిపించాడు.

"పొలాలకి తరిమేసిన మీ రాణిని పిలిపించండి. నిజం మీ కళ్ళముందు రుజువు చేస్తాను" అన్నాడు.

ఇద్దరు సిపాయిలు పరిగెత్తారు. అడివి రాణిని పిలుచుకువచ్చారు. ఆమెని గుమ్మం బయటే ఆగమన్నాడు రాజు. ఆమెకీ, కొయ్యగుర్రం కుర్రాడికీ మధ్య ఏడు మడతల దళసరి తెర కట్టించాడు. అప్పుడు కుర్రాడు అన్నాడు:

"తెర అవతల వున్న ఆమె నా కన్నతల్లి. ఇదే నిజమైతే ఆమె చనుబాలు ఈ ఏడు మడతల తెరలోంచి వచ్చి సరాసరి నా నోటిలో పడాలి"

అతడి నోటిలోమాట నోట్లోనే వుంది. అడివిరాణి తన పాలిండ్లు నొక్కింది. తెర దూసుకుని చనుబాలువచ్చి కుర్రాడినోట్లో పడ్డాయి.

"చూడండి" కేకపెట్టాడు కుర్రాడు. కచేరీ పెద్దలవేపు తిరిగి, "ఈమే నా అమ్మ! బుద్ధిమంతులుమీరు. మీరేచెప్పండి- మనిషికి రాయి పుట్టడం ఎప్పుడైనా విన్నారా, కన్నారా?" అని అడిగాడు.

"లేదు. లేదు" అంతమందీ వొక్కనోటితో అన్నారు. "నువ్వే మా యువరాజువి" అంటూ స్వాగతం పలికారు. ఆరుగురు రాణుల్నీ వూరిబయటికి తరిమేసి అడివిరాణిని పట్టపురాణిని చేసుకున్నాడు రాజు. ●